నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శనివారం 22 ఫిబ్రవరి 2025 | KHAMMAM

సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా, దిండిగాల

జలదోపిడీని పట్టించుకోరా?

- రేవంత్‌కు చంద్రబాబును, కేంద్రాన్ని ప్రశ్నించే దమ్ముందా?
- కృష్ణా జలాల పంపిణీపై త్రిసభ్య కమిటీ వేయాలి
- అందరి పక్షాన పోరాడుతున్నది బీఆర్ఎస్ మాత్రమే..
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 21: 'పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలను దోపిడీ చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోదా? ఈ ప్రభుత్వానికి బాధ్యత లేదా?' అని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ప్రశ్నించారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా బోర్డులో మనకు రావాల్సిన వాటా గురించి పట్టించుకోకుండా ఆంధ్రా సీఎం చంద్రబాబుకు ఊడిగం చేస్తున్నారని, దీనిపై బీజేపీ నాయకులు కూడా నోరు మెదపకుండా ప్రజలు, రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబును, కేంద్రాన్ని అడిగే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి ఉందా? అని ఆయన ప్రశ్నించారు. ఓట్లు, సీట్లు, అధికారం కోసం మాత్రమే బీజేపీ, కాంగ్రెస్ పోటీ పడుతున్నాయని, అధికారాన్ని అనుభవించేందుకు, పదవులు పంచుకునేందుకు ఆయా పార్టీల నాయకులు అర్రులు చాస్తున్నారని అన్నారు. కృష్ణా జలాలపై వెంటనే త్రీమెన్ కమిటీ వేయాలని, అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలని, అవసరమైతే ఢిల్లీలో ధర్నా చేస్తే రైతుల పక్షాన తాము కూడా పాల్గొంటామన్నారు. తెలంగాణ రాష్ట్రానికి, ఈ ప్రాంత ప్రజలకు రక్షణ కవచం ముమ్మాటికి బీఆర్ఎస్ పార్టీయేనని, కాంగ్రెస్, బీజేపీలకు నమ్మి ఓటేసిన ప్రజలను నట్టేట ముంచారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాలు దెబ్బతిన్నాయని, వివిధ వర్గాల ప్రజలు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకుండా పదవుల కోసం పాకులాడుతూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ మాత్రమే రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజల కోసం పోరాడుతున్నదని, కేసీఆర్ పదేళ్ల పాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి ఓటేస్తే అందరినీ మోసం చేసి.. రాష్ట్రాన్ని తిరోగమనంలోకి పయనించేలా చేస్తున్నారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దిండిగల రాజేందర్, కాపు సీతాలక్ష్మి, వేల్పుల దామోదర్, రావులపల్లి రాంప్రసాదరావు, కొట్టి వెంకటేశ్వరరావు, సంకుబాపన అనుదీప్, ప్రసాద్ గౌడ్, సింధు తపస్వి పాల్గొన్నారు.

ఉపయోగకరంగా భవిత కేంద్రాలు

పాల్వంచ పర్యటనలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

పాల్వంచ, ఫిబ్రవరి 21: భవిత కేంద్రాలు దివ్యాంగ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. పాల్వంచలోని భవిత కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన కలెక్టర్.. దివ్యాంగ పిల్లల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భవిత కేంద్రంలో అబ్దుల్ అజీజ్ అనే విద్యార్థి అందించిన ఫిజియోథెరపి ద్వారా నడవగలిగే స్థితికి వచ్చిన విద్యార్థి సక్సెస్ స్టోరీని కలెక్టర్ విని సంతోషం వ్యక్తం చేశారు. డీఈవో వెంకటేశ్వరాచారి, సమ్మిళిత విద్యా కో ఆర్డినేటర్ సైదులు, ఎంఈవో శ్రీరామ్మూర్తి, రిసోర్స్ పర్సన్లు శ్రీరామ్, కనకదుర్గ, అరుణకుమారి, అనిత పాల్గొన్నారు.



తీర్థాల క్రీడా ప్రాంగణంలో సాగవుతున్న మిర్చి తోట

- ఊరూరా కనుమరుగవుతున్న క్రీడా ప్రాంగణాలు
- తీర్థాలలో మిర్చి తోట, పెద్దతండాలో నర్సరీ
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కబ్జాలు

తోటల ప్రాంగణం!

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 21: ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించాలని, యువతకు ఆటలపై ఆసక్తి కల్పించాలనే గొప్ప ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం ఊరూరా క్రీడా ప్రాంగణాలతోపాటు వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసింది. ఆటలకు అనుకూలంగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, వాటి చుట్టూ ఫెన్సింగ్ నిర్మించింది. వివిధ క్రీడాంశాలకు సంబంధించిన వస్తువులు, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేసింది. ఆయా క్రీడా ప్రాంగణాల్లో విద్యార్థులు, యువకులు నిత్యం క్రీడా సాధన చేస్తుండగా.. సీనియర్ సిటిజన్లు వాకింగ్ ట్రాక్‌ను సద్వినియోగం చేసుకునేవారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటి నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో ఆలనా పాలన లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కబ్జాలకు గురవుతున్నాయి. తెల్దారుపల్లిలో ఏర్పాటు చేసి వైకుంఠధామం షెడ్‌లను సైతం గుర్తు తెలియని ఎత్తుకెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారు. పెద్దతండా పరిధిలోని క్రీడా ప్రాంగణంలో నర్సరీ నిర్వహిస్తున్నారంటే అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

క్రీడా ప్రాంగణంలో మిర్చి తోట, నర్సరీ

తీర్థాల పంచాయతీలో గత కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో ఏకంగా మిర్చి తోటను సాగు చేయడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. నెలలు గడిచినా కనీసం పంచాయతీ కార్యదర్శి అటువైపు చూశాడా? చూసినా పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాడా? అనేది తెలియాల్సి ఉంది. అయితే మిర్చి సాగు చేసిన భూమి దేవాదాయ శాఖ పరిధిలోనిది అని తెలుస్తుంది. అయితే అప్పటి అధికారులు ప్రభుత్వ భూములను మాత్రమే పంచాయతీలకు బదలాయింపు చేసి లక్షలాది రూపాయల వ్యయంతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సదరు భూమిలో మిర్చి తోట చేపట్టారు. అయితే ఆ భూమిని అధికారులు ఎవరికైనా లీజుకు ఇచ్చారా? లేదా మరెవరైనా తమకు అనుకూలంగా సాగు చేసుకుంటున్నారా? అనే విషయాన్ని ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది. మండలంలోని ఇతర క్రీడా ప్రాంగణాలు సైతం కబ్జాలకు గురికావడం, ఇతర అవసరాలకు వినియోగించుకుంటున్నా అధికారులు అటువైపు చూడకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పెద్దతండా క్రీడా మైదానంలో కొనసాగుతున్న నర్సరీ

రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నాయ్

- అయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు
- జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు
- ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబానికి పరామర్శ

రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు

మధిర, ఫిబ్రవరి 21: విద్యుత్ సరిగా లేక, యాసంగి సాగుకు నీరందక ఎండిపోతున్న పంటలను చూసి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆరోపించారు. చింతకాని మండలం లచ్చగూడెంలో సాగునీరందక ఎండిపోతున్న పంటలను చూసి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు ఎల్లయ్య కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం రైతు సాగు చేసిన వరి పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమల్‌రాజు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు పెరిగిపోతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. గత కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచారని, రైతుబీమా, పెట్టుబడి సాయం, 24 గంటల విద్యుత్, పుష్కలంగా సాగునీరు అందించి రైతును రాజు చేశారని గుర్తు చేశారు. రైతుల పంటలు ఎండిపోతున్నా నీరు అందించాలనే ధ్యాస ఈ ప్రభుత్వానికి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించి.. మృతిచెందిన కౌలు రైతు ఎల్లయ్య కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, మాజీ మండల ఉపాధ్యక్షుడు గురిజాల హనుమంతరావు, మంకెన రమేష్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటరామారావు, గడ్డం శ్రీనివాసరావు, మండల నాయకులు, రైతు సంఘం నేతలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి

తోడ్పాటునివ్వాలి

- అనర్హులకు ఇండ్లు మంజూరు చేస్తే చర్యలు
- అధికారుల శిక్షణలో కలెక్టర్ ముజమ్మిల్

ఖమ్మం, ఫిబ్రవరి 21: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ప్రతి దశలో తోడ్పాటు అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇల్లు గృహ నిర్మాణ పథకంపై ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల మండల, గ్రామ పంచాయతీస్థాయి అధికారులతోపాటు మండల ప్రత్యేక అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులకు మాత్రమే ఇల్లు అందేలా చూడాలని, వీటి నిర్మాణంపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి దరఖాస్తును ఎవరు పరిశీలన చేస్తున్నారు అనే వివరాలు పక్కాగా రికార్డు ఉంటుందని, అనర్హులకు ఇండ్లు మంజూరైనట్లు తేలితే సంబంధిత అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విడతల వారీగా ప్రతిఒక్కరికి ఇల్లు నిర్మించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. అత్యంత పేదలు, ఇండ్లు లేనివారు, సొంత స్థలం ఉన్నవారికి మొదటి విడతలో ఇళ్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటి ప్రతి దశ నిర్మాణంలో సామగ్రి ధరలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఎంపికచేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండ్ చేయాలని, రెండువారాల్లో ఇంటి బేస్మెంట్ పనులు పూర్తయ్యేలా చూడాలని, బేస్మెంట్ పూర్తయితే లక్ష రూపాయలు విడుదల అవుతాయన్నారు. ప్రతి సోమవారం పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్‌హౌస్‌ను పరిశీలించాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, డీఆర్డీవో సన్యాసయ్య, జడ్పీ సీఈవో దీక్షారైనా, డీపీవో ఆశాలత, హౌజింగ్ పీడీ శ్రీనివాసరావు, పీఆర్ ఈఈ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన అధికారులు

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

- వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ అల్ఫాస్ జానయ్య
- ముగిసిన బోధనా సిబ్బంది విశ్వవిద్యాలయ స్థాయి క్రీడలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న వీసీ డాక్టర్ అల్ఫాస్ జానయ్య

అశ్వారావుపేట, ఫిబ్రవరి 21: మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని, వృత్తిరీత్యా నిత్యం ఒత్తిడితో ఉండే ఉద్యోగులకు క్రీడలు ఎంతో అవసరమని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ అల్ఫాస్ జానయ్య పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన బోధనా సిబ్బంది విశ్వవిద్యాలయం స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ కళాశాలలో బోధించే శాస్త్రవేత్తలు విద్యార్థులను సమన్వయం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో బోధనేతర సిబ్బంది పాలుపంచుకోవాలని, శాస్త్రవేత్తలు, విద్యార్థులు, బోధనా సిబ్బంది సమష్టిగా పనిచేసినప్పుడే విశ్వవిద్యాలయ వ్యవస్థను మరింత పటిష్టం చేయగలమన్నారు. అనంతరం క్రీడా, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విజేతలకు జ్ఞాపికలతోపాటు ప్రశంసా పత్రాలను అందించారు. యూనివర్సిటీ డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డాక్టర్ సీహెచ్.వేణుగోపాల్‌రెడ్డి, యూనివర్సిటీ అబ్జర్వర్ డాక్టర్ జె.సురేశ్, వ్యవసాయ కళాశాల అసోషియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్, ఓఐఎస్ఏ డాక్టర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ జి.గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ శ్రావణ్‌కుమార్, 9 వ్యవసాయ కళాశాలల బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

'ఉద్దీపకం' ప్రాధాన్యాన్ని వివరించాలి

దుమ్ముగూడెం పర్యటనలో భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 21: ఇంగ్లిష్, గణితంలో కనీస సామర్థ్యాల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రవేశపెట్టిన ఉద్దీపకం వర్క్‌బుక్స్, వేదిక్ మ్యాథ్స్ ప్రాధాన్యాన్ని విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఉపాధ్యాయులకు సూచించారు. రామచంద్రునిపేట, రేగుబల్లి-2 ఆశ్రమ పాఠశాలలను శుక్రవారం సందర్శించిన ఆయన ఉద్దీపకం వర్క్‌బుక్స్, వేదిక్ మ్యాథ్స్‌కు సంబంధించి పాఠ్యాంశాలను విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారనే విషయాన్ని స్వయంగా ఆయన పరిశీలించారు. విద్యార్థులతో బోర్డుపై రాయించి ఒక్కో విద్యార్థిని లేపి ప్రగతిని పరిశీలించారు. 3 నుంచి 5 తరగతి వరకు చదువుతున్న పిల్లలు ఇంగ్లిష్ చదవడం, రాయడం, లెక్కలు చేయడంలో వెనుకబడిపోతున్నందున వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఫిజిక్స్, బయోసైన్స్ ల్యాబ్‌ను పరిశీలించి అవసరమైన సామగ్రి పంపిణీ చేస్తామన్నారు. పాఠశాలల్లో త్రీఫేజ్ కరెంటు, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం ఏమైనా మరమ్మతులు ఉంటే తప్పకుండా చేయిస్తామన్నారు. హెచ్ఎంలు బట్టు రాములు, భారతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాటాలకు రైతులు సన్నద్ధం కావాలి

ముగ్గురు మంత్రులున్నా రైతులకు న్యాయం జరగదాయె: సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

ఏఐకేఎస్ మహాసభలో మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 21: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. వ్యవసాయ, రెవెన్యూ, ఆర్థిక శాఖలకు చెందిన ముగ్గురు మంత్రులు జిల్లా నుంచి ఉన్నప్పటికీ రైతులకు ఆశించిన మేర న్యాయం జరగడం లేదని విమర్శించారు. మండలంలోని ఆరెకోడు గ్రామంలో ఏఐకేఎస్ (తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం) మండల మూడో మహాసభ శుక్రవారం జరిగింది. తొలుత ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సంఘం జెండాను రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేశ్ ఆవిష్కరించారు. ఏలూరి భాస్కర్, మామిడి సుదర్శన్‌రెడ్డిల అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ, రైతు భరోసా, పంటల బోనస్ పథకాలు సగానికి సగం మంది రైతులకు అందడం లేదని అన్నారు. ఖమ్మంలో మిర్చిబోర్డు ఏర్పాటు చేయాలని, రైతు సంక్షేమ పథకాలు అమలు చేయాలనే తీర్మానాలను ప్రవేశపెట్టారు. సంఘం నాయకులు మహ్మద్ మౌలానా, గోవిందరావు, దండి సురేశ్, తాటి వెంకటేశ్వర్లు, శంకరయ్య, వీరభద్రం, పుచ్చకాయల సుధాకర్, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం 21 మందితో సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మామిడి సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, ప్రభాకర్, కార్యదర్శిగా ఏలూరి భాస్కర్ ఎన్నికయ్యారు.

పామాయిల్ నర్సరీ (ఫైల్)

ఆయిల్‌ఫెడ్ ద్వంద్వ నీతి!

- పంపాల్సిన మొక్కలను పంపలేదు..
- పరిహారం ఇవ్వాలని కోష్టరికాలోని కంపెనీకి లేఖ!
- రేగళ్ల పాడులోని మంచి మొక్కలేనని ప్రచారం
- అయోమయంలో ఆయిల్‌పాం రైతులు

పంపాల్సిన మొక్కలను పంపలేదు..

ఆయిల్‌ఫెడ్ ఒకటే కాదు.. ఏ కంపెనీ కూడా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆయిల్‌పామ్ రీసెర్చ్ (ఐఐవోపీఆర్)కు నిబంధనల ప్రకారం పంపాల్సిన మొక్కలను పంపలేదు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తాం.
-సుధాకర్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ జీఎం

దమ్మపేటరూరల్, ఫిబ్రవరి 21: కల్లింగ్ మొక్కలు వచ్చిన బ్యాచ్‌లకు పరిహారం ఇవ్వాలని పామాయిల్ మొలకలను సరఫరా చేసిన కోష్టారికాలోని కంపెనీకి ఆయిల్‌ఫెడ్ లేఖ రాసినట్లు తెలిసింది. ఒక పక్క లేఖ రాయడం ద్వారా కల్లింగ్ మొక్కలని నిర్ధారించుకున్న తరువాత సైతం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేగళ్లపాడు నర్సరీలో మొక్కలన్నీ మంచివేనని ప్రచారం చేయడం ఆయిల్‌ఫెడ్ యాజమాన్య ద్వంద్వ నీతికి నిదర్శనంగా చెప్పవచ్చు. రేగళ్లపాడులో దశలవారీగా ఇప్పటివరకు సుమారు 1.5 లక్షల కల్లింగ్ మొక్కలను ధ్వంసం చేసిన విషయం విదితమే. వీటిలో ఇటీవల ధ్వంసం చేసిన 80వేల మొక్కలను అనుమతి తీసుకోకుండా ధ్వంసం చేశారని ఆరోపిస్తూ ఆయిల్‌ఫెడ్ అధికారులతోనూ, ఉద్యాన శాఖ అధికారులతోనూ పలు దఫాలు విచారణలు పూర్తయ్యాయి. విచారణలో తేలిన నిజాలు ఆయిల్‌ఫెడ్, ఉద్యాన శాఖలు బయటకు రానీయలేదు. ఈ నర్సరీలో ఇంకా యాగాంబి, తంబా రకాలకు చెందిన కల్లింగ్ మొక్కలు సుమారు 3 లక్షలకు పైగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే రేగళ్లపాడు నర్సరీ నుంచి మొక్కలు తీసుకెళ్లి పామాయిల్ సాగు చేస్తున్న రైతులు తమకు ఎటువంటి మొక్కలు ఇచ్చారో తెలియక అయోమయంలో ఉన్నారు. లక్షల్లో కల్లింగ్ మొక్కలు వస్తున్నా దీనిపై ఆయిల్‌ఫెడ్, ఉద్యాన శాఖ రైతులకు వివరణ, భరోసా ఇవ్వకపోవడంతో రైతుల్లో పలు అనుమానాలు కలుగుతున్నాయి.

అమలుకాని ఎస్‌వోపీ గైడ్‌లైన్స్..

పామాయిల్ నర్సరీలను స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్ నిబంధనల ప్రకారం నిర్వహించాలి. ఈ నిబంధనలను తెలంగాణ ఆయిల్‌ఫెడ్ పూర్తిగా తుంగలో తొక్కిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల సత్తుపల్లి ఆయిల్‌ఫెడ్ కార్యాలయంలో జరిగిన విచారణలో సస్పెన్షన్‌కు గురైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి విచారణ అధికారులకు ఎస్‌వోపీ గైడ్‌లైన్స్‌పై ప్రశ్నలు గుప్పించినట్లు సమాచారం. ఈ గైడ్‌లైన్స్ ప్రకారం 25 శాతానికి మించి దిగుమతి చేసుకున్న బ్యాచ్‌లో కల్లింగ్ మొక్కలు వస్తే ఆ బ్యాచ్‌ను పూర్తిగా తిరస్కరించి మొలకలను సరఫరా చేసిన కంపెనీ నుంచి పరిహారం రాబట్టాల్సి ఉంది. దీనిపై స్పష్టమైన అధికారిక ప్రకటన ఆయిల్‌ఫెడ్, ఉద్యాన శాఖల నుంచి కరువైంది.

ఐఐవోపీఆర్‌కు మొక్కలు పంపాలి

విదేశాల నుంచి విత్తనాలు, మొలకలు దిగుమతి చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి పొందాలి. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఎగ్జిమ్ కమిటీ నుంచి ఆయిల్‌ఫెడ్ పలుమార్లు అనుమతి పొందింది. సదరు అనుమతి పత్రంలో పేర్కొన్న మొక్కల నుంచి కొన్నింటిని (అనుమతి పత్రంలో పేర్కొన్న మొలకల సంఖ్య) ఐఐవోపీఆర్‌కు పంపాలి. ఈ నిబంధనలు ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆయిల్‌ఫెడ్ ఏమాత్రం పట్టించుకోకపోవడం ప్రస్తుత దుస్థితికి కారణంగా చెప్పవచ్చు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రైతుల ధర్నా

పంట పొలాలకు దారి చూపాలంటూ అన్నదాతల డిమాండ్

వేంసూరులో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ధర్నా నిర్వహిస్తున్న రైతులు

వేంసూరు, ఫిబ్రవరి 21: పంట పొలాల్లోకి వెళ్లేందుకు గ్రీన్‌ఫీల్డ్ హైవే వల్ల ఇబ్బంది పడుతున్నామని, తమకు దారి చూపాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా వేంసూరు మండలం ఎర్రగుంటపాడు, వేంసూరు గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కన ఉన్న తమ పంట పొలాల్లోకి వెళ్లేందుకు దారి ఇవ్వకుండా కంచె వేయడంతో కిలోమీటర్లకొద్దీ తిరిగి తమ పొలాలకు రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి తోటల్లోకి కూడా కనీసం వాహనాలు వెళ్లడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కనున్న పొలాల్లోకి వెళ్లేందుకు దారి చూపాలని వారు కోరారు. కార్యక్రమంలో వేంసూరు, ఎర్రగుంటపాడు రెవెన్యూ పరిధిలోని గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బోనస్ విడుదల చేయాలని నిరసన

రైతుభరోసా, రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని రైతు సంఘం డిమాండ్

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న రైతు సంఘం నేత బొంతు రాంబాబు

వైరా టౌన్, ఫిబ్రవరి 21 : పెండింగ్‌లో ఉన్న రూ.65 కోట్ల ధాన్యం బోనస్ డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి మయాన్ మంజు ఖాన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ రెండు నెలల నుంచి రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జడం కావడం లేదన్నారు. జిల్లాలో 23,244 మంది రైతులకు రూ.65 కోట్లు, వైరా మండలంలో 3,115 మంది రైతులకు రూ.9.45 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఆయా రైతులందరూ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. రూ.2 లక్షల్లోపు అప్పున్న రైతులకు రుణమాఫీ ఊసే లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం బోనస్, రైతు భరోసా, రుణమాఫీపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చలపతిరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.